# నీటి హక్కుల విషయంలో రాజీ లేదు

- శాసన సభకు రండి చర్చ చేద్దాం
- కెసిఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- నీళ్లు నిజాలపై మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నీటి హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నీళ్లు-నిజాలు అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసన మండలి సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో నీటి హక్కుల విషయంలో అడుగడుగునా అన్యాయం జరిగిందని విమర్శించారు. ఇంటర్ స్టేట్ డిస్ప్యూట్ యాక్ట్-1956 ప్రకారం ఏర్పడ్డ జస్టిస్ బచావత్ నేతృత్వంలో కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్-1 (కేడబ్ల్యూడీటీ)ఉమ్మడి ఆంధ్రాకు 811 టిఎంసిలు కేటాయించిందని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు దక్కిన 299 టిఎంసిలపై పోరాటం చేయక పోగా సమ్మతిస్తూ అపెక్స్ కౌన్సిల్లో సంతకాలు చేశారన్నారు. 2014 నుంచి వరుసగా మూడేండ్లు ఒక్కో సంవత్సరం చొప్పున, ఆ తర్వాత 2020లో కెడబ్ల్యుడిటి తుది అవార్డు వచ్చే వరకు పాత పంపకాలకు కట్టబడతామని లిఖిత పూర్వకంగా ఒప్పుకున్నారని విమర్శించారు. కెసిఆర్ చేసిన సంతకాల వల్లే కృష్ణా నదిలో తెలంగాణ నీటి హక్కులను కోల్పోయిందని గుర్తు చేశారు. బచావత్ ట్రిబ్యూనల్ అవార్డు ప్రకారం కేటాయించిన 811 టిఎంసిల్లో 70 శాతం కృష్ణా పరివాహక ప్రాంతం ఉన్న తెలంగాణకు న్యాయబద్ధంగా 555 టిఎంసిలు, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ మధ్యంతర అవార్డు ప్రకారం 763 టిఎంసిలు దక్కాల్సి ఉందని సిఎం అన్నారు. రావాల్సిన నీటిపై కేంద్రంపై ఒత్తిడి తేవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

**శ్రీశైలానికి మార్చడం వెనుక కుట్ర కోణం**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం ద్వారా కృష్ణాలో ఆంధ్రప్రదేశ్ జల దోపిడీకి బిఆర్ఎస్ ద్వారాలు తెరిచిందని సిఎం విమర్శించారు. మూడు టిఎంసిలను నుంచి ఏకంగా ఆంధ్రప్రదేశ్ రోజుకు 13 టిఎంసిలు తరలించుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణాపై ప్రస్తుతం తెలంగాణ 0.25 శాతం నీళ్లు కూడా తీసుకుపోయే మెకానిజం లేదనీ, ప్రతిపాదించిన పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి, దిండి తదితర ప్రాజెక్టులన్ని పూర్తయినా రోజుకు నాలుగు టిఎంసిలు కూడా తీసుకుపోలేమని అన్నారు. ఆనాడు రూ.32 వేల కోట్ల ప్రాజెక్ట్ అంచనా నేడు రూ.84 వేల కోట్లకు చేరిందని విమర్శించారు. మూడు లిఫ్ట్‌లను ఐదు లిఫ్ట్‌లకు మార్చడంలో దోపిడీ దాగుందని చెప్పారు. తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా కమిషన్ల కోసమే కెసిఆర్ మార్చారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూ.35 వేల కోట్లున్న ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని రూ.1.5 లక్షల కోట్లకు చేర్చారని విమర్శించారు. అంచనాలు పెంచడం ద్వారా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

టిజిటిఎ డైరీని ఆవిష్కరించిన సిఎం

**మనుగడ కోసమే బిఆర్ఎస్ జలవివాదం**

2023 తర్వాత వరుసగా జరిగిన అన్ని ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి పాలయిందని సిఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆ పార్టీ మనుగడ కష్టమనే భావించి రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను సృష్టించి పబ్బం గడుపుకునేందుకు కెసిఆర్ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పార్టీని బతికించుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ సిఎంకు చంద్రబాబుకు సహకరిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెసిఆర్, హరీశ్‌రావు, కెటిఆర్‌లు అబద్దాలను ప్రచారం చేయడంలో ఆరి తేరి పోయారని ఎద్దేవా చేశారు. నిన్నటి వరకు కృష్ణాలో నీటి దోపిడీ జరుగుతోందని గగ్గోలు పెట్టిన బిఆర్ఎస్.. అపెక్స్ కౌన్సిల్‌లో వారు చేసిన సంతకాలను బయట పెట్టడంతో పాటు జూరాల స్థల మార్పుపై విచారణకు ఆదేశించాలని నిర్ణయించిన క్రమంలో రూటు మార్చి గోదావరి నల్లమల సాగర్‌ను ఎత్తుకున్నారని ఆరోపించారు. కెసిఆర్ చేసిన ఆర్థిక నేరాలకు మిడిల్ ఈస్ట్ దేశాల్లో అయితే బహిరంగంగా ఉరి తీస్తారని వ్యాఖ్యానించారు. అన్నింటా దొరికి పోవడంతో తెలంగాణ నీటి పారుదల సలహాదారు ఆదిత్యనాథ్ ఆంధ్రకు చెందిన వారని కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. ఆయన ఆంధ్రా క్యాడర్‌లో పని చేసిన బిహార్‌కు చెందిన వ్యక్తని రేవంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ తన పదేండ్ల కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పని చేసిన ఎంతో మంది ఐఎఎస్ అధికారులను తీసుకున్నారని గుర్తు చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కృష్ణా నీటి వాటాలో 71 శాతం తెలంగాణకు, 29 శాతం ఏపీకి ఇవ్వాలని పోరాడుతామని స్పష్టం చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**కేసీఆర్ సభకొచ్చి సలహాలివ్వాలి**

రాష్ట్రానికి పదేండ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కెసిఆర్ శాసన సభకొచ్చి నీటి హక్కుల సాధనలో చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనలివ్వాలని విజ్ఞప్తి చేశారు. "మీ గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా చూసే బాధ్యత నాది. ఎలాంటి భేషజాలకు తావు లేదు. మీ అనుభవాన్ని తెలంగాణ అభివృద్ధికి అందించాలని కోరుకుంటున్నాం. సభలో మంచి సాంప్రదాయాన్ని కొనసాగిద్దాం. మీరు సభకు రండి. వీలు కాని పక్షంలో తెలంగాణ నీటి హక్కులను సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై లేఖ రాయండి" అని సిఎం కోరారు. 2004 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో పని చేసిన కేకే, జానారెడ్డి లాంటి సీనియర్లు ప్రెస్‌మీట్ పెట్టి సభకు రావాలని కెసిఆర్‌కు విజ్ఞప్తి చేయాలని కోరారు.

**నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం: ఉత్తమ్**

బిఆర్ఎస్ పదేండ్ల పాలనలోనే నీటి వాటాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. పవర్ పాయింట్ పాయింట్ సందర్భంగా తెలంగాణకు బిఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని అంకెలతో సహ వివరించారు. "బచావత్ ట్రిబ్యూనల్ పంపకాల్లో జరిగిన వివక్షను తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అడ్డుకోలేదు. బచావత్ అవార్డు ప్రకారం ఏపీకి 66 శాతం (512 టిఎంసిలు) 34 శాతం (299 టిఎంసిలు) కేటాయింపులను అంగీకరిస్తూ అపెక్స్ కౌన్సిల్, కెఆర్ఎంబి బోర్డు మీటింగుల్లో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు సంతకాలు చేశారు. వారి సంతకాలే తెలంగాణకు నేడు మరణ శాసనం అయ్యాయి. 2015లో పాలమూరు అంచనా వ్యయం రూ.35 వేల కోట్లు. జిఒ ఇచ్చిన ఏడేండ్ల తర్వాత ప్రభుత్వం కేంద్రానికి డిపిఆర్ పంపించారు. అందులో ఆయకట్టు వివరాలు లేక పోగా రూ.55 వేల కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి ఎకరానికి కూడా నీరివ్వలేదు. ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే ఇంకా రూ.80 వేల కోట్లు కావాల్సి ఉంది. 36 శాతం పనులు పూర్తయితే 90 శాతం పూర్తయ్యాయని అబద్దాలు చెబుతున్నారు. తమ ప్రభుత్వం రెండేండ్లలో రూ.ఏడు వేల కోట్లు ఖర్చు చేసింది. తట్టెడు మట్టి తీయలేదని బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. వాస్తవాలను ఇక్కడికొచ్చిన ప్రజా ప్రతినిధులు వాస్తవాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలి" అని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు.

డైరీ, పుస్తకం ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

## ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించండి

- సిఎంకు టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న ఇళ్లస్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను సిఎం దృష్టికి తెచ్చారు. ఇళ్లస్థలాలకు సంబంధించి కొత్త విధానం తీసుకురావాలని కోరారు. హెల్త్‌కార్డులు అన్నీ కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవడం లేదా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగానే కొత్త ఆరోగ్య విధానం అమలుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా జర్నలిస్టులు ఆందోళన చెందుతున్న జీవో 252ను వెంటనే సవరించాలని సూచించారు. జర్నలిస్టుల మధ్య విభజన తీసుకురావొద్దని చెప్పారు. పాత్రికేయ వృత్తిలో అనేక మార్పులు వస్తున్నాయనీ, రిపోర్టర్లు, డెస్క్‌జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిఎం స్పందిస్తూ తన పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నానని అన్నారు. సిఎంతో పాటు రాష్ట్ర సమాచార, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సమాచార, పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్ఒ గుర్రం మల్సూర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎం, మంత్రికి పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రాజశేఖర్, కార్యదర్శి బి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంకు డిజిపి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో డిజిపి శివధర్‌రెడ్డి, అదనపు డీజీ మహేశ్ భగవత్‌లు కలిశారు. సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎం వారితో మాట్లాడారు. ఈ ఏడాది సైతం పోలీసుశాఖకు మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని చెప్పారు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అటవీ అధికారులకు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆమె జూనియర్ అటవీ అధికారుల సంఘం వార్షిక క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అనతరం న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షులు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షులు సాంబు నాయక్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సుకన్య, కోశాధికారి కోటేశ్వర రావు తదితరులు మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌ను కలుద్దాం

- వెంటనే అపాయిమెంట్ తీసుకోండి
- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శికి మంత్రి సీతక్క ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ. మూడు వేల కోట్ల నిధుల కోసం త్వరలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర మంత్రి అపాయిమెంట్ తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్‌ను ఆ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. గురువారం మంత్రిని శ్రీధర్ కలిశారు. ఈ సందర్భంగా నిధులు త్వరగా రాబట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. నిధుల విడుదలకు సంబంధించి ఫైల్ ప్రస్తుతం ఏ స్టేజీలో ఉంది, ఇంకా ఎన్ని రోజులు పడుతుందని ఆరా తీశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేయాలని ఎన్నికలు పూర్తయిన వెంటనే పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ లేఖ రాశారని ఈ సందర్భంగా శ్రీధర్ తెలిపారు. "ఎన్నికల ఫలితాల గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు గతంలో పంచాయతీలకు విడుదల చేసిన నిధులకు సంబంధించి గ్రాంట్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (జిటిసి) సమర్పించాలని ఆదేశించారు. గతంలో మంజూరై ఖర్చు చేయని రూ.273 కోట్ల ఆర్థిక సంఘం నిధులపై వివరణ కోరింది. నిధుల మళ్లింపుపైనా ఆరా తీసింది" అని శ్రీధర్ మంత్రి సీతక్కకు వివరించారు. కేంద్రం అడిగిన అన్నిఅంశాలపై క్లారిఫికేషన్స్ పంపించామని తెలిపారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధుల విడుదల కోసం అసెంబ్లీ తర్వాత మంత్రి సీతక్క డిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం.

## నాలుగో సింహం మినిస్టీరియల్ స్టాఫ్

- నూతన సంవత్సర వేడుకల్లో డిజిపి ప్రశంస

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ స్థాయిలో రాష్ట్ర పోలీసులు అగ్రగామిగా పేరు పొందడానికి వెన్నుదన్నుగా మినిస్టీరియల్ స్టాఫ్ అందిస్తున్న సేవలు కూడా ఉన్నాయని డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి ప్రశంసించారు. గురువారం డిజిపి కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన మాట్లాడుతూ... కార్యాలయాల్లో పని చేస్తూ క్షేత్రస్థాయిలో పని చేసే పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సహకారాన్ని ఎప్పటికప్పుడు మినిస్టీరియల్ స్టాఫ్ అందిస్తున్నదని తాను ఇంతకు ముందు డిజిపి కార్యాలయంలో ఆరేండ్ల పాటు కో-ఆర్డినేషన్, పర్సనల్, తదితర విభాగాలలో అదనపు డిజిగా పని చేసిన సందర్భంలో ఈ కార్యాలయంలో పని చేసే మినిస్టీరియల్ స్టాఫ్ విధ్యుక్త ధర్మాలను అవగాహన చేసుకోవడానికి వీలైందని శివధర్‌రెడ్డి తెలిపారు. కనిపించని నాలుగో సింహం మినిస్టీరియల్ స్టాఫ్ అని ఆయన అభివర్ణించారు. పోలీసు శాఖలో తీసుకొస్తున్న వినూత్న విధానాలకు కార్యాలయ సిబ్బంది కూడా అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ సరిదిద్దుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా మినిస్టీరియల్ స్టాఫ్‌కు చెందిన ఒక మహిళ వినిపించిన ఒక కవితకు స్పందించిన డిజిపి అక్కడికక్కడే రూ.10 వేల బహుమానాన్ని అందజేసి, అభినందించారు. అనంతరం మినిస్టీరియల్ స్టాఫ్‌ను కలిసి కేక్ కట్ చేసి అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం అదనపు డిజి మహేశ్ భగవత్, సిఐడి చీఫ్ చారుసిన్హా, సైబరాబాద్ నూతన కమిషనర్ రమేశ్ పాల్గొన్నారు.

## యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

- సిఎం రేవంత్ రెడ్డికి అసదుద్దీన్ ఒవైసీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ లోక్ సభ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్ రెడ్డికి గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 1,200 మంది అధ్యాపకులు ఏండ్ల తరబడి కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారని తెలిపారు. వీరిని రెగ్యులర్ చేసిన తర్వాతే మిగిలిన పోస్టులను నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన సూచించారు

## ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ రూపొందించండి

- ముఖ్యమంత్రికి ఎస్‌టియుటిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ సర్వీసు రూల్స్‌ను రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డిని ఎస్‌టియుటిఎస్ కోరింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డితో కలిసి ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ముఖ్యమంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆ సంఘం నూతన సంవత్సర డైరీనీ సీఎం ఆవిష్కరించారు. అనంతరం నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. జి సదానందంగౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ రూపొందించకపోవడంతో పాఠశాల విద్యాశాఖలో పర్యవేక్షణాధికారుల కొరతతో తీవ్ర సంక్షోభం ఏర్పడిందని తెలిపారు. పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం కోసం తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ కమిటీ చైర్మన్ కె కేశవరావుతో చర్చిస్తానని సిఎం హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

# 2026 పోరాటాల సంవత్సరం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడతాం
- నూతన సర్వీస్ నిబంధనలు రూపొందించాలి
- నూతన సంవత్సర డైరీ, కేలండర్, అధ్యాపక దర్శిని ఆవిష్కరణలో చావ రవి

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు : ఎ వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యారంగ సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం 2026 పోరాటాల సంవత్సరంగా ఉండబోతున్నదని ఎస్‌టిఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన 2026 సంవత్సర డైరీ, కేలండర్‌తో పాటు అధ్యాపక దర్శినిని ఆవిష్కరించారు. విద్యారంగంలో పర్యవేక్షక పోస్టులు భారీ స్థాయిలో ఖాళీగా ఉండి పర్యవేక్షణ కొరవడిందని ఆయన విమర్శించారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి ఇదొక కారణమని ఆయన తెలిపారు. దీనిని అధిగమించేందుకు వీలుగా 2018 రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షక పోస్టులైన జిల్లా విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు తదితర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా అంతరాలు పెంచుతూ విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించేలా తెలంగాణ విద్యా విధానం తెస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జాతీయ విద్యా విధానాన్ని దొడ్డిదారిన రాష్ట్రంలోకి టిఇపి పేరుతో తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. విధాన రూపకల్పనలో తల్లిదండ్రుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని చావ రవి సూచించారు. 2024 మార్చి తర్వాత పదవీ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ ఇచ్చేందుకు అవసరమైతే రూ.10 వేల కోట్లు అప్పు తెచ్చైనా సరే క్లియర్ చేయాలని కోరారు.

**కేంద్రం మౌనం వీడాలి**

ఇప్పటికే సర్వీస్‌లో ఉన్న 25 లక్షల మంది టీచర్లకు టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్రం మౌనం వీడాలని చావ రవి డిమాండ్ చేశారు. ఐదేళ్లపైబడి సర్వీస్ ఉన్న వారిని రెండేండ్లలోపల టెట్ అర్హత సాధించాలని ఇచ్చిన తీర్పుతో రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయలేదనీ, పార్లమెంటులోనూ చర్చించడం లేదనీ, వారికి అవసరమైన భరోసా ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్టు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో టెట్ పరీక్షకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

చదవుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు. టిఎస్‌యుటిఎఫ్ 2011లోనే ఈ మేరకు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని ఆయన గుర్తుచేశారు. జనగామలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర సదస్సులో ఈ ఏడాది పెద్ద ఎత్తున పోరాడాలని తీర్మానించినట్టు తెలిపారు. అదే విధంగా టిఎస్‌యుటిఎఫ్ కార్యకర్తలు పని చేసే పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలోనూ సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ సమావేశంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, విశాలి, ఎస్.వై.కొండలరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజారావు, శ్యామ్ సుందర్, జగన్నాథ శర్మ, జిల్లాల నాయకులు భగవంత్ రాజ్, భువనేశ్వరి, కవిత, భాషా, మాజీద్, సీనియర్ నాయకులు మస్తాన్ రావు, అశోక్, వెంకటేశ్వర్లు, అరుణ, రామకృష్ణా, రమేష్ పాల్గొన్నారు.

## టిజిటిఎ డైరీని ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ) నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లో రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి నేతృత్వంలో రేవంత్‌రెడ్డిని టిజిటిఎ ప్రతినిధుల బృందం కలిసింది. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు కృషి చేస్తారని తెలిపింది. ఈ కార్యక్రమంలో టిజిటిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రాములు, మహిళా అధ్యక్షులు ఎం రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్‌పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, సిహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

## ఉన్నతమైన ఆలోచనలతో నుమాయిష్ ప్రారంభం

హైదరాబాద్ బ్యూరో : ఉన్నతమైన ఆలోచనలతో ఎగ్జిబిషన్ (నుమాయిష్) మొదలైందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 85వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్)ను మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు ఆర్.సుఖేష్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి రాజేశ్వర్‌తో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాలాపన చేసి, రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉన్నతమైన ఆలోచనలతో వివిధ రాష్ట్రాలకు చెందిన చిన్న, మధ్య తరగతి వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా నుమాయిష్ మొదలైందని చెప్పారు. ఎగ్జిబిషన్ అంటే ఇండస్ట్రియల్‌కి సంబంధించింది మాత్రమే కాదని, వివిధ రాష్ట్రాలకు చెందిన విభిన్న సంస్కృతులు, ఉత్పత్తుల కళానైపుణ్యం ప్రదర్శించడానికి ఒక సెంటర్ అని చెప్పారు. 1938లో ప్రారంభమైన నుమాయిష్ 1949లో ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌గా ప్రత్యేక ప్రాముఖ్యత లభించిందని, మొదటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలచారి హయాంలో నుమాయిష్ ఏర్పడిందని వివరించారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో విద్యా సంస్థలకు ఖర్చు పెడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీని ఈ నుమాయిష్ పేరును ప్రపంచ స్థాయికి ఎదిగేందుకు కృషి చేస్తామన్నారు.

# ప్రమాదాలు, మరణాల రేటు తగ్గుదలే లక్ష్యం

- ప్రయత్నం వల్ల ఒక్క ప్రాణం దక్కినా సంతృప్తే
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించి, మరణాల రేటును తగ్గించడమే లక్ష్యంగా విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు - 2026' (జనవరి1 నుంచి 31 వరకు) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మంత్రి స్వయంగా అధికారులకు హెల్మెట్ తొడిగి అవగాహన కల్పించారు. రోడ్ సేఫ్టీ పోస్టర్లు, వాహన స్టిక్కర్లు, విద్యార్థులకు అవగాహన పుస్తకాలను ఆవిష్కరించారు. యాదగిరిగుట్టలో జరిగిన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌నూ ఉదయం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 26వేల రోడ్డుప్రమాదాలు జరుగుతుండగా,ఎనిమిది వేల మంది మరణిస్తున్నారని, ప్రతిరోజూ సగటున 22 మంది ప్రాణం కోల్పోవడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని వెల్లడించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో భాగంగా రవాణా శాఖ అధికారులు ప్రతి పాఠశాలకూ వెళ్లాలని ఆదేశించారు. 'విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రుల నుంచి 'మేము రోడ్డు నిబంధనలు పాటిస్తాం' అని హామీ పత్రంపై సంతకాలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వాహనాల లైసెన్సులను సస్పెండ్ చేస్తున్నామని, రవాణా శాఖ అధికారులు ట్రాఫిక్ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటుపై నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. మన ప్రయత్నం వల్ల ఒక్క ప్రాణం దక్కినా సంతృప్తి ఉంటుందని, మీడియా కూడా దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**4-ఈ విధానంతో ముందుకు..**

ఈ ఏడాది 'సడక్ సురక్ష - జీవన్ సురక్ష' నినాదంతో.. ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ (4-ఈ) అనే నాలుగు అంశాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు. రవాణా, ఆర్‌టిసి శాఖలే కాకుండా కలెక్టర్లు, పోలీస్, ఆర్అండ్‌బి,విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే 'బ్లాక్ స్పాట్స్'ను గుర్తించి తొలగించాలని ఆదేశించారు.

**ఆర్టీసీ డ్రైవర్లకు అభినందనలు**

అనంతరం ఆర్‌టిసి కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని, 30 ఏండ్లుగా ఒక్క ప్రమాదమూ చేయకుండా బస్సు నడుపుతున్న డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. ఆర్‌టిసిని ప్రజల 'లైఫ్ లైన్'గా అభివర్ణించిన మంత్రి, 2026 నాటికి సంస్థ పాత బకాయిలు తీర్చి లాభాల బాటలో నడిచేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆర్‌టిసిలో 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. వాణిజ్య వాహనాల కట్టడికి సాంకేతికతను వాడాలని, హెవీ వెహికల్ డ్రైవర్లకు ఎప్పటికప్పుడూ ఆరోగ్య పరీక్షలు, శిక్షణ ఇవ్వాలని మెదక్ కలెక్టర్ మాదిరిగా అన్ని జిల్లాల్లోనూ బ్లాక్ స్పాట్స్ తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసిలుఎం.చంద్రశేఖర్ గౌడ్, సి.రమేష్, శివలింగయ్య, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీధర్, యూనిసెఫ్ హెడ్ డాక్టర్ జీలం, స్టేట్ ఆర్‌టిఎ మెంబర్ నవీన్, జిల్లా ఆర్‌టిఎ సురేష్ లాల్ పాల్గొన్నారు

**In the Honourable Court of the Principal Senior Civil Judge at Anakapalli EA 151/2025 IN EP 43/2020 In O.S. NO.186/2009**

Between :
Sri. Gorle Atcham Naidu
.... DHr/ Plantiff
And
Sri. S. Mutyalu (died) and 3 others
...J.Dr'S/ Defendants
To
**J. Dr 2 :** Smt.Summengl Kondamma W/0 S. Mutyalu, Residing at D.No.6-3-100/1, Shivaji Nagar area, Sangareddy post, Medak district

**Notice**

Please take notice that the Honourable Court was pleased to order Notice in the above E.P. in Order XXI Rule 34 and E. A. Section 50 R/W sec, 151 of C. P. C., notice to you through this publication. Therefore you are hereby called upon to appear before the Honourable Court **on 19-01-2026 at 10.30 A.M.,** personally or through an advocate. If you fail to attend the Honourable Court that day the matter will be heared in your absence and necessary orders will be passed.

**Sri N.S.V. Reddy**
Advocate
Venu Madhavi Villa
NGOs Colony, Akkayyapalem,
Visakhapatnam -16
Visakhapatnam Mobile : 9393102036
Date : 01.01.2026

## వీధి కుక్కల దాడిలో బాలునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీధి కుక్కల దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన రంగారెడ్డి జిల్లా బండ్లగూడ సర్కిల్ హైదర్‌షాకోట్‌లోని శాంతినగర్ కాలనీలో గురువారం జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడు వేదాంతరెడ్డి ఇంటి బయట ఆడుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న నాలుగు వీధి కుక్కలు బాలుడ్ని చుట్టుముట్టి దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడిన బాలుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. బాలుని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బండ్లగూడ సర్కిల్‌లో ఉదయం, సాయంత్రం సమయంలో వీధి కుక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. వీధి కుక్కల నుంచి తమను రక్షించాలని కోరారు.

## పిల్లలకు విషం ఇచ్చి తల్లి ఆత్మహత్య

- తల్లీ కూతురు మృతి... ప్రాణాలతో బయటపడిన కుమారుడు
- భర్త మరణాన్ని తట్టుకోలేకనే అఘాయిత్యం ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కల్వకుర్తి పట్టణంలో కలకలం రేపింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బుక్ సెంటర్ నిర్వహిస్తున్న భీంశెట్టి ప్రకాష్ (47) నెల రోజుల కిందట గుండె పోటుతో మృతి చెందారు. భర్త మృతిని తట్టుకోలేక భార్య ప్రసన్న (38) గురువారం మధ్యాహ్నం కుమార్తె మేఘన (13), కుమారుడు అశ్రీత్ రాం (15)కు అన్నంలో విషం కలిపి తినిపించి ఆమె కూడా తిన్నారు. ప్రసన్న తమ్ముడు అదే సమయంలో ఇంటికి వచ్చి డోరు తీయగా ముగ్గురూ అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి తల్లి, కూతురు మృతి చెందారు. కుమారుడు ప్రాణాలతో బయటపడ్డాడు. అతను ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

## బకాయిలను విడుదల చేయండి

- సిఎస్‌కు ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ బొల్లెపాక కిరణ్, సెక్రటరీ డాక్టర్ కిరణ్ మాదల తదితరులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు లేఖ ద్వారా విన్నవించారు. యూజీసీ, పీఆర్సీ బకాయిలకు సంబంధించి ఎక్కువ మంది 25 బిల్లులు సమర్పించినప్పటికీ, కొన్ని విడతలకు సంబంధించిన బకాయిలే విడుదలయ్యాయని తెలిపారు. 2022కు సంబంధించి నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్కో ఉద్యోగికి రెండు లక్షల వరకు ఇవ్వాల్సి ఉందని వివరించారు. మిస్సింగ్ సిపిఎస్ కంట్రిబ్యూషన్లను వెంటనే సమీక్షించి, ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పార్ట్ జీపీఎఫ్, సీపీఎస్ ఉపసంహరణలను వెంటనే క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్‌కు సిఎం శుభాకాంక్షలు

- ముఖ్యమంత్రికి పలువురి ప్రముఖుల విషెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సిఎం రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో ముఖ్యమంత్రి, గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆపరేషన్ కుమార్‌సింగ్‌తోనూ సిఎం మర్యాదపూర్వకంగా భేటీ అయి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# సారొస్తారొస్తారా...

- కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో కీలక చర్చ
- బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రాకపై ఉత్కంఠ
- సర్కారు నిర్లక్ష్యాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయి. బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు (కెసిఆర్) రాకపై ఉత్కంఠ నెలకొంది. గతనెల 29న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు ఆయన హాజరయ్యారు. అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. సభలో కేవలం ఏడు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరై సంతకం పెట్టకుంటే అనర్హత వేటు పడుతుందని, జీతం రాదు కాబట్టే వచ్చి వెళ్లారన్న విమర్శలు వెల్లువెత్తాయి. అయితే గతనెల 21న బిఆర్ఎస్ఎల్పి, రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. అనంతరం కెసిఆర్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణకు, ప్రజలకు ఎంత నష్టం కలుగుతుందో వివరించారు. బిఆర్ఎస్ హయాంలో రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేసినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని, తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. పైగా ఆ ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్రం వెనక్కి పంపించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలకు శ్రీకారం చుడతామని, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో బహిరంగసభలను నిర్వహిస్తామని ప్రకటించారు. అసెంబ్లీ వస్తే అన్ని విషయాలనూ చర్చిద్దామంటూ సిఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. అనుకున్నట్టుగానే గతనెల 29న మొదటి రోజు అసెంబ్లీకి కెసిఆర్ హాజరయ్యారు. శుక్రవారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కృష్ణా, గోదావరి జలాలపై కీలక చర్చ జరగనుంది. కెసిఆర్ ప్రశ్నలకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చే సమాధానం కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సభకు కెసిఆర్ హాజరవుతారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.



**బిఆర్ఎస్ ఉప నేతల నియామకంతో వచ్చేది అనుమానమే...**

బిఆర్ఎస్ఎల్పి ఉప నేతలుగా మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పి సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కెసిఆర్ నియమించారు. శాసనమండలిలోనూ ఉప నేతలుగా ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. బిఆర్ఎస్ఎల్పి ఉప నేతల నియామకంతో కేసీఆర్ సభకు వచ్చేది అనుమానమేనన్న అభిప్రాయం వినిపిస్తున్నది. ఆయన ఫాంహౌజ్‌లోనే ఉన్నారు. ఒకవేళ అసెంబ్లీకి హాజరు కావాలనుకుంటే గురువారం సాయంత్రం నాటికి నందినగర్‌లోని నివాసానికి చేరుకోవాలి. కానీ ఇప్పటి వరకు చేరుకోలేదు. దీంతో కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉండకపోవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అయితే బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలని భావిస్తున్నది. ఈ దిశగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఏపీ ప్రభుత్వంతో రాజీపడడం, మోడీకి, చంద్రబాబుకు సిఎం రేవంత్‌రెడ్డి భయపడి నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను సభలో నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ఎపి జలదోపిడీతో తెలంగాణకు జరుగుతున్న నష్టాన్ని ప్రజలకు మరోసారి వివరించనుంది. అయితే కృష్ణా, గోదావరి జలాల విషయంలో బిఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను ఎత్తిచూపేందుకు అధికార పక్షం సిద్ధమవుతోంది. విపక్షాల ప్రశ్నలకు ధీటైన సమాధానాలను ఇచ్చేందుకు మంత్రులు రెడీగా ఉన్నారు. గురువారం ప్రజాభవన్‌లో నదీజలాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బిఆర్ఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాల వల్ల తెలంగాణకు ఎలా నష్టం కలిగిందో చెప్పారు. ఇదే విషయాలను అసెంబ్లీలోనూ అధికార పక్షం బలంగా వినిపించనుంది. కేసీఆర్ సభకు రావాలని కాంగ్రెస్ కోరుతున్నది. ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వాలని సూచిస్తోంది. ఏం జరుగుతుందో వేచిచూడాల్సిందే.

## సిఎంకు టిఇజెఎసి నేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలంగాణ ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో వారు సిఎం రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు వెల్లడించారు. తెలంగాణ గజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బి.శ్యామ్‌ను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. పదవి విరమణ పొందిన ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణను ముఖ్యమంత్రి శాలువతో సత్కరించారు. వారివురికి సిఎం అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జెఎసి నాయకులు ముజీబ్ హుస్సేన్, ఎ సత్యనారాయణ తదితరులున్నారు.

## అక్రిడిటేషన్ సమస్యపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాం

- జర్నలిస్టులను విడదీసే రెండు కార్డుల విధానం సరికాదు : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ప్రశ్నిస్తామని బిఆర్ఎస్ఎల్పి ఉప నేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును టియుడబ్ల్యుజె ప్రతినిధులు కలిసి 252 జీవోను సవరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి యూనియన్ ప్రతినిధులు పలు విషయాలను తెచ్చారు. గతంలో ఉన్న 239 జీవో ప్రకారం రాష్ట్రంలో 23 వేల మందికి అక్రిడిటేషన్ కార్డులు లభించేవనీ గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన 252 జీవో ప్రకారం దాదాపు 13 వేల మంది జర్నలిస్టులు అక్రిడిటేషన్లను కోల్పోయే ప్రమాదముందని వివరించారు. డెస్క్, జర్నలిస్టులంటూ విభజించి రెండు కార్డుల విధానాన్ని తీసుకురావడం వల్ల జర్నలిస్టుల మధ్య విభజన రేఖలు గీసినట్లవుతుందన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జర్నలిస్టుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను గౌరవించాల్సింది పోయి వారిని అణచివేసేలా కొత్త నిబంధనలు తేవడం దుర్మార్గమని అన్నారు. డెస్క్, జర్నలిస్టులు అంటూ రెండు కార్డుల విధానం తేవడం వారి మధ్య చిచ్చు పెట్టడమేనని చెప్పారు. కొత్త జీవో వల్ల జర్నలిస్టులు హెల్త్‌కార్డులు, బస్‌పాస్ సౌకర్యాలను కోల్పోయే ప్రమాదముందని అన్నారు. జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల, వారి ప్రయాణ సౌకర్యాల పట్ల ప్రభుత్వానికి పట్టింపులేకపోవడం శోచనీయమని వివరించారు. జర్నలిస్టులకు అన్యాయం చేసే ఈ జీవోపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని చెప్పారు. టియుడబ్ల్యుజె పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వానికి సూచనలు చేసి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, కోశాధికారి పి యోగానంద్, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ రమణకుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి యార నవీన్‌కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, చిన్నపత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్, టియుడబ్ల్యుజె హైదరాబాద్ అధ్యక్షులు రాకేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లుగా మారిన స్వీపర్, సెక్యూరిటీ గార్డు

- రామాయంపేట సర్కారు దవాఖానలో వైద్యం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యం అస్తవ్యస్తంగా మారింది. నలుగురు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరే ఉండడం, ఆ ఉన్న ఒక్కరూ రికార్డులు రాయడంలో నిమగ్నమవ్వడంతో.. ప్రాణాపాయ స్థితిలో వచ్చిన బాధితులకు చికిత్స చేసేందుకు స్వీపర్లు, వాచ్‌మెన్లే 'డాక్టర్లు'గా మారాల్సిన దుస్థితి నెలకొంది. సిబ్బందికి చికిత్స అప్పగించి, డాక్టర్ రికార్డు రాస్తుండడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని నార్సింగ్ మండలం జప్తి శివునూర్ గ్రామ సమీపంలో గురువారం ఒక ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రామయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రిలో బాధితులకు వైద్యం అందిస్తున్న తీరు చూసి అక్కడి వారు అవాక్కయ్యారు.

**డ్యూటీ డాక్టర్లు ఎక్కడ?**

నిబంధనల ప్రకారం ఆస్పత్రిలో నలుగురు వైద్యులు విధుల్లో ఉండాలి. కానీ, అక్కడ కేవలం ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఆ ఇద్దరిలో ఒకరు వ్యక్తిగత పని మీద బయటకు వెళ్లగా, మిగిలిన ఒక్క వైద్యురాలు రికార్డులు రాయడంలో నిమగ్నమయ్యారు. ఎనిమిది మంది బాధితులు రక్తపు మడుగులో నానా అవస్థలు పడుతుంటే, వైద్యురాలు మాత్రం తన పనిలో తాను ఉండటం గమనార్హం.

**వైద్యులుగా మారిన సిబ్బంది**

ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు కుర్చీకే పరిమితమైతే, కనీస అవగాహన లేని ఇతర సిబ్బంది వైద్యం చేయడం రోగుల ప్రాణాలతో చెలగాటమాడటమేనని బాధితుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన బాధితులకు డ్రెస్సింగ్ చేయడం, చికిత్స నిర్వహించడం వంటి పనులు స్వీపర్, వాచ్‌మెన్ చేస్తుండడం విస్మయం కలిగిస్తోంది. అత్యవసర సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, ఉన్నవారు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఈ విషయమై జిల్లా వైద్యాధికారి (డిసిహెచ్) శివ దయాల్‌ను వివరణ కోరగా.. రామాయంపేట ఆస్పత్రిలో పరిస్థితిపై వైద్యులతో మాట్లాడానని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## న్యూ ఇయర్ కిక్కు ...
# మూడు కమిషనరేట్లలో 2731 మందిపై కేసులు

- హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,198 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం : ట్రాఫిక్ జాయింట్ సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సంవత్సర (2026) వేడుకల సందర్భంగా నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఒక్క రోజు వ్యవధిలోనే మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 2731 మందిపై కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలను నివారించే లక్ష్యంతో డిసెంబర్ 31 సాయంత్రం 7 గంటల నుంచి గురువారం(జనవరి 1వ తేదీ) మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 1,198 మందిపై కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. మద్యం సేవించి పట్టుబడిన వారిలో ద్విచక్ర వాహనదారులే అత్యధికంగా ఉన్నారు. మొత్తం నమోదైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి: ద్విచక్ర వాహనదారులు 1,042 మంది, ఆటోలు/ త్రీ వీలర్స్ 51 మంది, కార్లు, ఇతర వాహనాలు 105 మంది ఉండగా.. ఆల్కహాల్ మోతాదు(బీఏసీ లెవల్స్) వారిగా కేసుల వివరాలు చూస్తే.. 30 - 50 పాయింట్లు: 175 కేసులు, 51 - 100 పాయింట్లు: 468 కేసులు (అత్యధికం), 101 - 150 పాయింట్లు: 293 కేసులు, 151 - 200 పాయింట్లు: 163 కేసులు, 201 - 250 పాయింట్లు: 51 కేసులు, 251 - 300 పాయింట్లు: 31 కేసులు, 300 పాయింట్ల కంటే ఎక్కువ: 17 కేసులు నమోదయ్యాయి. పౌరులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్న ఉద్దేశంతోనే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు బాధ్యతాయుతంగా జరుపుకోవడానికి ఈ చర్యలు దోహదపడినట్టు చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల 'జీరో టోలరెన్స్' విధానాన్ని పాటిస్తామని, భవిష్యత్‌లోనూ ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. సైబరాబాద్‌లో 928 మంది, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 605 మంది డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు.

# ప్రజల జీవితాల్లో మార్పు లేదు

- రాష్ట్రంలో తిరోగమన పాలన : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏండ్లు మారుతున్నాయి, క్యాలెండర్లు మారుతున్నాయి కానీ కాంగ్రెస్ పాలనలో ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన బిఆర్ఎస్ డైరీ, నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి వైపు కాకుండా తిరోగమనం వైపు ప్రయాణిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని చెప్పారు. చలికాలంలోనూ గంటల తరబడి వరుసలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని అన్నారు. తెలంగాణ కోసం కేంద్రంతోనూ, సమైక్య వాదులతోనూ 14 ఏండ్లు పోరాటం చేశామని గుర్తు చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటంలోనూ కార్యకర్తలు బలంగా భాగస్వాములయ్యారని వివరించారు. లగచర్లలో గిరిజనులపై దాడులు జరిగాయనీ, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారనీ, రైతుబంధును రెండుసార్లు ఎగ్గొట్టారనీ, ఆరు గ్యారంటీలు, 420 హామీలపై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించారని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో జరిగిన దాష్టీకానికి వ్యతిరేకంగా, హెచ్‌సియు భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా నిలిచిన వారిని కెటిఆర్ అభినందించారు. గెలుపోటములు సహజమనీ, ప్రజల గుండెల్లో కెసిఆర్, గులాబీ జెండా స్థానం శాశ్వతమని అన్నారు. ఈ ఏడాది పోరాటాన్ని కొనసాగిస్తూనే పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని చెప్పారు. పోరాటం, నిర్మాణం రెండింటి ఆధారంగా ముందుకు సాగాలని కోరారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ చేయలేవన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా బిఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. 2028లో కెసిఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చూడటమే లక్ష్యమని చెప్పారు. ఎన్నికల్లో ఎదురుదెబ్బలను పట్టించుకోకుండా ముందుకు సాగాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మాజీమంత్రులు మహమూద్ అలీ, జి జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, వి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గంద్ర వెంకట రమణారెడ్డి, తుల ఉమ, దేవీప్రసాదరావు, రాకేశ్, కిశోర్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నిర్బంధించిన మార్క్‌ఫెడ్ అధికారులు

## మార్క్‌ఫెడ్ అధికారులను నిర్బంధించిన రైతులు

- సోయా పంట కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిల్వ ఉన్న సోయా పంటను కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ డిఎం ప్రవీణ్‌రెడ్డి, డిసిఒ మోహన్‌ను గురువారం రైతులు కార్యాలయంలో నిర్బంధించారు. సోయా పంటను పరిశీలించేందుకు వచ్చిన అధికారులను రైతులు నిలదీశారు. సోయాను నెలల తరబడి మార్కెట్ యార్డులో లారీల్లో లోడ్ చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను కార్యాలయంలో నిర్బంధించారు. పోలీసులు జోక్యం చేసుకొని సమస్యలపై అధికారులతో మాట్లాడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న సోయా పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సంచులు కుట్టేందుకు దారాలు సైతం రైతులే కొనుగోలు చేసి ఇవ్వాల్సి వస్తోందని, హమాలీలకు ప్రభుత్వం కూలిరేటు చెల్లిస్తున్నప్పటికీ రైతుల వద్ద క్వింటాలుకు రూ.45 అధికంగా వసూలు చేస్తున్నారని వాపోయారు. వాటిపై విచారణ జరిపిస్తామని అధికారులు అన్నారు. అనంతరం మార్కెట్ అధికారులు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సోయా పంట కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే బిఆర్ఎస్‌కూ అవకాశమివ్వాలి

- కెటిఆర్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనుకుంటే బీఆర్ఎస్‌కూ అవకాశమివ్వాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. నదీజలాలపై అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమకు ఉపన్యాసాలు ఇస్తారా?అని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ చెక్‌డ్యామ్‌లు ఎలా ఫెయిల్ చేయాలో నేర్పిస్తారా? అని అడిగారు. మేడిగడ్డ ఎలా పేల్చారో చెప్తారా?అని ప్రశ్నించారు. సుంకిశాల ఎలా కూల్చారో చూపిస్తారా? అని అడిగారు. వట్టెం పంప్‌హౌస్ ఎలా ముంచారో తమకు వివరిస్తారా? అని తెలిపారు. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులన్నింటినీ కేఆర్ఎంబికి ఎలా ధారాదత్తం చేశారో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించబోతున్నారా? అని పేర్కొన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లిచ్చారా అని ప్రశ్నించారు. ఒక్క చెరువును బాగు చేశారా, ఒక్క కాలువను మరమ్మతు చేశారా అని అడిగారు. అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షానికి సమాన హక్కులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే బిఆర్ఎస్‌కూ ఆ అవకాశం ఇవ్వాలని సూచించారు. ఈ విషయంపై స్పీకర్‌కు లేఖ ఇచ్చామని, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూస్తామని అన్నారు. పదేళ్లలో వ్యవసాయాన్ని, సాగునీటి రంగాన్ని ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్లామో సభలో వివరిస్తామని చెప్పారు. 2016, మార్చి 31న కెసిఆర్ ముఖ్యమంత్రిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినపుడు కాంగ్రెస్ పార్టీ సభను వాకౌట్ చేసిందని గుర్తు చేశారు. ఇది పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమన్నారు.

## నేటి అసెంబ్లీలో 'ఉపాధి'పై లఘు చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల విరామం అనంతరం అసెంబ్లీ, కౌన్సిల్ భేటి జరగనున్న విషయం తెలిసిందే. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టనున్నారు. అలాగే ఉపాధి హామీపై లఘు చర్చ జరగనుంది. ఈమేరకు శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి గురువారం బులెటిన్ విడుదల చేశారు. మూసీ నది పునర్జీవం, ఎల్లారెడ్డి పట్టణంలో ఆరోగ్య సంరక్షణ సేవలు, అంగన్‌వాడీ వర్కర్లకు సవరించిన జీతాల చెల్లింపు, వ్యవసాయ అధారిత పరిశ్రమల స్థాపన, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్టేడియం తదితర అంశాలపై ఆయా సభ్యులు ప్రశ్నలు వేయనున్నారు.

ఈమేరకు ఆయా శాఖల మంత్రులు సంసిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా బాల శక్తి పథకం, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, తెలంగాణ రాష్ట్రంలో బెల్ట్‌షాపులు, మద్యం దుకాణాల క్రమబద్ధీకరణ, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్లకు సంబంధించి కూడా ప్రశ్నలు వేయనున్నారు. కాగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పథకం మార్చిన నేపథ్యంలో అసెంబ్లీలో లఘు చర్చ జరగనుంది. దీనిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రతిపాదించారు. ఈ అంశంపై సభ్యులు చర్చల్లో పాల్గొననున్నారు. కాగా సిఎం రేవంత్‌రెడ్డి సైతం దీనిపై మాట్లాడే అవకాశం లేకపోలేదని సమాచారం.

## కాంగ్రెస్‌కు 'రాజకీయ' శిక్ష ఖాయం

- మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి రాజకీయ శిక్ష ఖాయమని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆ సమయం కోసం తెలంగాణ సమాజం ఎదురుచూస్తున్నదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెసిఆర్ సభకు రావాలంటూనే ఆయన చావును కోరుకోవడం దుర్మార్గమని తెలిపారు. కెసిఆర్ హయాంలో తప్పులు జరిగితే వాటిని ఎత్తి చూపి సరిచేసి చూపెట్టాలని డిమాండ్ చేశారు. ఆదిత్యనాథ్‌దాస్ సమర్థుడైతే 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో పూర్తయిన ప్రాజెక్టుల్లో ఏపీలో ఎన్ని, తెలంగాణలో ఎన్ని? అని ప్రశ్నించారు. ఆయన నియామకం తర్వాత రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు నిర్మాణం పరుగులు పెట్టించారని తెలిపారు. బనకచర్ల నిర్మాణానికి రేవంత్‌రెడ్డి ఒప్పుకున్న విషయం బట్టబయలు కావడంతో ఆయన దోషిగా నిలబడ్డారనీ, అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు నాడు, నేడు ద్రోహం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. జూరాల నుంచి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలనుకోవడం అవివేకం, అవగాహనా రాహిత్యమనీ, ఇది ద్రోహం చేయడమేనని తెలిపారు. పాలమూరుకు అన్యాయం చేస్తే ప్రజల చేతిలో శిక్ష ఖాయమని హెచ్చరించారు.

## అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి

- మాజీమంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని బిఆర్ఎస్ఎల్పి ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. నటనకు ఇచ్చినట్టు అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రేవంత్‌రెడ్డినే అందరూ ఎంపిక చేస్తారని తెలిపారు. ఆయన నోటి నుంచి టిఎంసిల కొద్దీ అబద్ధాలు, క్యూసెక్కుల కొద్దీ అజ్ఞానాన్ని పారించారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బేసిన్లపై బేసిక్ నాలెడ్జీ ఆయనకు లేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బచావత్ ట్రిబ్యునల్‌కు, బ్రిజేష్ ట్రిబ్యునల్‌కు తేడా తెలియదని ఎద్దేవా చేశారు. సభకు వస్తే కెసిఆర్‌ను అవమానించం అని ఒకవైపు చెప్తూనే కసబ్‌తో పోల్చుతావా?అని ప్రశ్నించారు. తెలంగాణ పోరాటాన్ని ఉరకలెత్తించి నాలుగు కోట్ల మంది ప్రజలను ఒక్కటి చేసి ప్రాణాలకు తెగించి నిరాహారదీక్ష చేసి కాంగ్రెస్ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. ఆయన్ను కసబ్‌తో పోల్చిన సీఎంకు సంస్కారం, మర్యాద అనే పదాలకు అర్థం కూడా తెలియదని తెలిపారు. ఆయనకు తెలిసిందల్లా అనాగరికమైన భాష, అసభ్య పదజాలం, బూతు ప్రసంగమని ఆగ్రహం వ్యక్తం చేశారు.